క్లుప్తంగా

లోవ దేవస్థానంలో ప్లాస్టిక్ నిషేధం అమలు

తుని రూరల్: తలుపులమ్మ లోవ దేవస్థానంలో అక్టోబరు నుంచి ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తున్నట్టు డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. బుధవారం దేవస్థానం కార్యాలయంలో ఆయన వ్యాపారులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం, దేవదాయశాఖ కమీషనర్ ఆదేశాల మేరకు ప్లాస్టిక్ రహిత దేవస్థానంగా తీర్చిదిద్దాల్సి ఉందన్నారు. అందుకు వ్యాపారులంతా సహకరించాలన్నారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలపై నిఘా ఉంచుతామని, నిషేధాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముందస్తుగా వ్యాపారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

గ్రామ సచివాలయాల్లో తనిఖీ

కోటనందూరు: బిల్లనందూరు, ఎస్సార్ పేట, భీమవరపుకోట గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ వెంకటనారాయణ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, రికార్డులు పరిశీలించిన ఆయన పలు సూచనలు చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యారంగ సమస్యలపై అవిశ్రాంత పోరాటం

గోకవరం: విద్యారంగంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలపై యూటీఎఫ్ రణభేరి కార్యక్రమం ద్వారా అవిశ్రాంత పోరాటం చేస్తుందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గోపీమూర్తి అన్నారు. రణభేరి కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన గోకవరం ఎమ్మార్సీ కార్యాలయం వద్ద జాతా నిర్వహించారు. ఉపాధ్యాయుల తమ సమస్యలపై మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జాతా వివిధ జిల్లాల నుంచి మొదలై 19న ఏలూరులో ముగుస్తుందన్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్, రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి, జిల్లా కార్యదర్శి నాగభూషణం, జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ ప్రేమ్‌కుమార్, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు హరినాథ్, వివిధ జిల్లాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంట నమోదుతో రైతులకు మేలు

తొండంగి: ఖరీఫ్‌లో వరి సాగు వివరాలను ఈ పంటలో నమోదు చేస్తేనే ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు వీలుంటుందని వ్యవసాయశాఖాధికారి ఎంఎంపీఎస్ పద్మశ్రీ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలుపై వ్యవసాయశాఖ గ్రామ సచివాలయాల అగ్రికల్చర్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పౌరసరఫరాల శాఖ అధికారి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు సంబంధించి పలు అంశాలు వివరించారు. ఏఈవో మాధన సతీష్ వర్మ, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

శంఖవరం: కాకినాడలో నిర్వహించిన వారధి జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారని ప్రిన్సిపాల్ వీర్రాజు బుధవారం తెలిపారు. వై.అపర్ణాదేవి, ఇ.దేవకి, డి.లహరి తృతీయ స్థానంలో నిలిచారు. వక్తృత్వ పోటీలో స్వాతి, హర్షిని తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలను ప్రిన్సిపాల్ వీర్రాజు, ఏఈఓ ఎస్వీ రమణ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

ప్రత్తిపాడు రూరల్: రాచపల్లి అడ్డురోడ్డు వద్ద క్లస్టర్ రిసోర్స్ మొబైల్ టీచర్ల (సీఆర్ఎంటీ)కు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాస నాయుడుకు బుధవారం ఏపీసీఆర్పీడబ్ల్యూఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎలుపే రాంజీప్రసాద్ ఆధ్వర్యంలో ఆ సంఘ నేతలు వినతిపత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్సీ గాదె శ్రీనివాస నాయుడు అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం విచ్చేసిన సందర్భంగా ఆయన్ని ఏపీసీఆర్పీడబ్ల్యూఏ నేతలు మర్యాదపూర్వకంగా కలసి సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా రాంజీప్రసాద్ మాట్లాడుతూ పద్నాలుగేళ్లుగా సీఆర్ఎంటీగా పనిచేస్తున్నా ఉద్యోగ భద్రత కల్పించలేదని రాంజీ ప్రసాద్, కొల్లు గంగారావు అన్నారు.

రహదారి భద్రత నిబంధనలు పాటించాలి



బైక్ రైడింగ్‌ను ప్రారంభిస్తున్న ఆదిత్య కళాశాల అధ్యాపకులు

గండేపల్లి: ప్రమాదాల నివారణకు వాహనచోదకులు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని ఆదిత్య డిప్యూటీ ప్రొ చాన్సలర్ ఎం శ్రీనివాసరెడ్డి, ప్రొ వైస్ చాన్సలర్ రమేష్ పేర్కొన్నారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో బుధవారం మోటార్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో కేటీఎం అకాడమీ సేఫ్ రైడింగ్ ఈవెంట్‌కు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ప్రొఫెషనల్ సేఫ్ రైడింగ్, రైడర్, డిసిప్లిన్, మోటార్‌స్పోర్ట్స్ భద్రత ప్రమాణాలపై ప్రాక్టికల్ శిక్షణకు వంద మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన కేటీయం అకాడమీ డైరెక్టర్ ఆఫ్ ఈవెంట్స్ అమన్, ఆదిత్య పాల్గొని తమ బృందంతో సేఫ్ రైడింగ్ నిర్వహించినట్టు తెలియజేశారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డుపై సంత.. సమస్యలతో చింత

- వారపు సంతలో వసతుల కరవు
- ఏళ్ల తరబడి ఇదే తంతు
- ఎండా వానల్లో కొనుగోలుదారులకు, వర్తకులకు తప్పని తిప్పలు



ప్రత్తిపాడు హైస్కూల్‌కు వెళ్లే దారిలో వారపు సంత



ప్రత్తిపాడులో దుకాణం ఏర్పాటుకు రోడ్డుపై వర్షపు నీటిని తోడుకుంటున్న వర్తకులు

ప్రత్తిపాడు: పురాతన సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలిచే గ్రామీణ ప్రాంతాల వారపు సంతలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. వారపు సంతల నిర్వహణలో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ప్రమాదాలు జరిగే అవకాశముందని తెలిసినా రోడ్లపైనే దుకాణాలు ఏర్పాటు చేసుకుని సంతలు నిర్వహిస్తున్నారు. ఏటా సంతల ద్వారా లక్షలాది రూపాయల ఆదాయం వస్తున్నా పంచాయతీ అధికారులు వర్తకులకు సౌకర్యాల కల్పనపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫలితంగా వ్యాపారులు, వినియోగదారులకు అవస్థలు తప్పడం లేదు.

షెడ్లు, తాగునీరు లేక అవస్థలు

ప్రత్తిపాడు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో కొనసాగుతున్న వారపు సంతల్లో వ్యాపారులు, కొనుగోలుదారులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఈ వారపు సంతల్లో కనీస వసతులు లేక దుకాణదారులు ఎండకు, వానకు ఇబ్బందులు పడుతూ వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. వారపు సంతల్లో వసతులు సమకూర్చడంలో పంచాయతీ అధికారులు విఫలమవుతున్నారు. ఆదాయం సమకూరుతున్నా అధికారులు వారపు సంతల బాగోగులు పట్టించుకోకపోవడంతో ప్లాస్టిక్ పట్టాలు, బరకాలు, చెట్ల నీడ లేదా ఎండావానల్లోనే క్రయ విక్రయాలు సాగుతున్నాయి. వ్యాపారులకు షెడ్లు లేకపోవడంతో గత్యంతరం లేక ప్రధాన రహదారులపై దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో ప్రతి వారం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. కనీసం తాగు నీరు కూడా అందుబాటులో లేకపోవడంతో సంతలకు వచ్చే కొనుగోలుదారులు, వ్యాపారులు అవస్థలు పడుతున్నారు. నియోజకవర్గ కేంద్రమైన ప్రత్తిపాడులో ప్రతి బుధవారం నిర్వహించే వారపు సంతలో తాజా కూరగాయలు, ఆకుకూరలు అమ్మకానికి వస్తుంటాయనే నమ్మకంతో ప్రజలు కొనుగోలుకు తరలివస్తుంటారు. ప్రత్తిపాడు చుట్టుపక్కల గ్రామాలైన ధర్మవరం, ఏలూరు, టి.రాయవరం, పి జగన్నాథపురం గ్రామాల నుంచి ఈవారపు సంతకు వస్తుంటారు. ఈనేపథ్యంలో వారానికి ఒకరోజు నిర్వహించే వారపు సంతలో కనీస వసతులు కరువయ్యాయి.



ప్రత్తిపాడు వారపు సంతలో ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన దుకాణాలు

వారపు సంతలు... పల్లె ప్రజల వాణిజ్య కూడళ్లు

మారు మూల గ్రామాల్లోనూ వారపు సంతలు జరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో జరిగే ఈవారపు సంతలు పల్లె వాసులకు వాణిజ్య కూడలి వంటివి. ఈ వారపు సంతలకు సమీప గ్రామాల ప్రజలు వచ్చి, తమకు వారానికి కావలసిన సరుకులను కొనుగోలు చేసి వెళ్తుంటారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో ప్రతిరోజూ ఏదో ఒక గ్రామంలో వారపు సంత నిర్వహిస్తుంటారు. ప్రత్తిపాడు మండలం శరభవరంలో ఆదివారం, పెద్దిపాలెంలో సోమవారం, శంఖవరం మండలం పెదమల్లాపురంలో మంగళవారం, శంఖవరంలో శుక్రవారం, ఏలేశ్వరంలో గురువారం, రౌతులపూడి మండలం మాతయ్యపేట, బలరామపురంలో బుధవారం, ములగపూడిలో గురువారం, రాజవరంలో శనివారం ఇలా వారంలో ప్రతి రోజూ సంతలు నిర్వహిస్తున్నారు. ఈ సంతలకు సమీప గ్రామాల నుంచి అధిక సంఖ్యలో వస్తుంటారు. పప్పు, ఉప్పు మొదలుకొని కిరాణా, ఎండు మిర్చి, కూరగాయలు ఇలా అన్ని రకాల వస్తువులు ఈ సంతల్లో లభిస్తాయి. వేలాది రూపాయల క్రయ విక్రయాలు జరుగుతుంటాయి. పెద్దిపాలెం, రౌతులపూడి, పెదమల్లాపురం వారపు సంతలకు సుమారు 30 గ్రామాలకు చెందిన గిరిజనులు అటవీ ఉత్పత్తులను విక్రయిస్తుంటారు. తమకు కావలసిన నిత్యావసర వస్తువులను కొనుగోలు చేసుకుంటారు.

వర్షాకాలంలో మరింత ఇబ్బంది

సరకు నేలపై విక్రయాలకు అనుకూలంగా పరచుకున్న తర్వాత వర్షం వస్తే వ్యాపారుల అవస్థలు ఇన్నీ అన్నీ కావు. సరకు వర్షానికి తడిసి నష్టం చవి చూడాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దుకాణ ప్రదేశంలో వాన నీటిని తామే శుభ్రం చేసుకుని, వ్యాపారానికి అనువుగా మార్చుకుంటామని వారు చెబుతున్నారు. వర్షం వస్తే అమ్మకాలు తగ్గిపోతాయని, ఉన్న వస్తువులను అయినకాడికి అమ్ముకోవాల్సి వస్తుందని వారపు సంత వ్యాపారులు చెబుతున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి



వారపు సంతల్లో కూరగాయలు అమ్ముతుంటా. సంతల్లో తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస వసతులు కల్పించాలి. వ్యాపార నిర్వహణకు షెడ్లు ఏర్పాటు చేసి, ఎండా వానల నుంచి రక్షణ కల్పించాలి.

– శెనంశెట్టి సత్తిబాబు, కాయగూరల వ్యాపారి, కృష్ణవరం, కిర్లంపూడి మండలం

షెడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం



పంచాయతీల ఆదాయం మేరకు వారపు సంత నిర్వహణకు షెడ్లు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం. స్థల సేకరణ చేపట్టి, నిధుల మంజూరు కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతాం.

– కేవీవీఎస్ కాశీ విశ్వనాథం, ఇన్‌చార్జి ఎంపీడీఓ, ప్రత్తిపాడు

ఘనంగా విశ్వకర్మ జయంతి

ప్రత్తిపాడు: విశ్వకర్మ జయంతిని ప్రత్తిపాడులో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సంఘ కార్యాలయం వద్ద జిల్లా సంఘ క్రమశిక్షణ కమిటీ వైస్ చైర్మన్, పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను భగవాన్ విశ్వకర్మ సృష్టించిన పంచరంగుల పతాకాన్ని ఆవిష్కరించారు. విశ్వకర్మ చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. శింగిలిదేవి సత్తిరాజు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మకు పూజలు

ఏలేశ్వరం: విశ్వబ్రాహ్మణ, స్వర్ణకార సంఘాల ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ వీధిలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో బుధవారం విశ్వకర్మ జయంతి నిర్వహించారు. సంఘ సభ్యులు విశ్వకర్మ చిత్రపటానికి పూజలు చేసి పల్లకీలో ఊరేగించారు. అనంతరం ఆలయం వద్ద అన్నదానం చేశారు.

విశ్వకర్మ మహాయజ్ఞం

కిర్లంపూడి: స్థానిక కామాక్షి సహిత విశ్వకర్మ, వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద విశ్వకర్మ మహాయజ్ఞం బుధవారం ఘనంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆంధ్రరాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ తాళాబత్తుల సాయి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విశ్వబ్రహ్మ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అత్తిలి వీరబ్రహ్మం, జిల్లా కార్యదర్శి కొమ్మోజు సత్యనారాయణ, మండలాధ్యక్షుడు గానుగుల శ్రీనివాసరావు, కార్యదర్శి కొత్తల వీరప్రసాద్, సహాయ కార్యదర్శి లక్కోజు శివరామకృష్ణ పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో విశ్వకర్మ ఊరేగింపు

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లండి

వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు

రౌతులపూడి: ఏడాదిన్నర కాలంగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో తొలిసారిగా బుధవారం మండలంలోని దిగువశివాడ, గంగవరం గ్రామాల్లో ఇంటింటి పర్యటనకు ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ గ్రామ కమిటీలతో సమావేశమై ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సూచించారు.

రాష్ట్రంలో రాక్షసపాలన

కూటమి ప్రభుత్వం చేపడుతున్న దుర్మార్గపు పాలనపై గళమెత్తిన సాక్షి చానల్ ప్రసారాన్ని నిషేధించి రాక్షసపాలన సాగిస్తున్నారని గిరిబాబు ఆరోపించారు. ప్రజలంతా సాక్షి చానల్ ప్రసారం చేయని కేబుల్ ఆపరేటర్లను నిలదీయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆ రెండు గ్రామాల్లోనూ నూతనంగా ఏర్పాటు చేసిన గ్రామ కమిటీలను పరిచయం చేసుకుని రానున్న కాలంలో ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో పర్యటించి నిత్యం ప్రజా సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీశివకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, పార్టీ మండల కన్వీనర్ సోహెచ్‌వీవీ సత్యనారాయణ, నాయకులు వాసిరెడ్డి భాస్కర బాబు, సోమరౌతు రాజా, ఆ రెండు గ్రామాల పార్టీ నేతలు కొరుప్రోలు దేవుడు, సైపురెడ్డి వెంకటరమణ, మంతిన పాపారావు, పాశిల తాత బాబు, రాపర్తి రామకృష్ణ, సోమరౌతు తిరుముల వెంకన్నదొర, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గంగవరంలో పార్టీశ్రేణులతో కలసి ఇంటింటి పర్యటన నిర్వహిస్తున్న ముద్రగడ గిరిబాబు

పశువుల్లో పాల ఉత్పత్తి పెంచడమే లక్ష్యం

గోకవరం: పశువుల్లో పాల ఉత్పత్తి పెంచడమే లక్ష్యంగా పశువైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్టు తూర్పు గోదావరి జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శ్రీనివాస్‌రావు అన్నారు. జాతీయ గోకుల్ మిషన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని అచ్యుతాపురంలో పశువులకు ఉచిత గర్భకోశవ్యాధుల నిర్ధారణ, చికిత్సా శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి సందర్శించారు. గ్రామంలోని 65 గేదెలు, 17 ఆవులకు గర్భకోశ పరీక్షలు చేసి రూ.20 వేలు విలువైన మందులు అందజేశామన్నారు. జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా గత నెల 15వ తేదీ నుంచి అక్టోబరు 14 వరకు సిబ్బంది ప్రతి గ్రామంలో పర్యటించి పశువులకు టీకాలు వేస్తారని తెలిపారు. జగ్గంపేట ఏఎంసీ చైర్మన్ అడపా భరత్ కుమార్, గోకవరం సొసైటీ చైర్మన్ గాజింగం సత్తిబాబు, సర్పంచ్ బత్తుల శ్రీనుల చేతుల మీదుగా పాడి రైతులకు మందులు పంపిణీ చేశారు. డిప్యూటీ డైరెక్టర్ ఎం వెంకటేశ్వరరావు, ఏడీ ప్రభావతి, గోకవరం, కోరుకొండ, సీతానగరం మండలాలకు చెందిన పశువైద్యులు, రైతులు పాల్గొన్నారు.

బీరువా బహూకరణ

అన్నవరం: స్థానిక సత్యదేవ హైస్కూల్లో 1969–70 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు రూ.30 వేలు విలువ చేసే ఇనుప బీరువాను బుధవారం బహూకరించారు. హైస్కూల్ హెచ్‌ఎం ప్రసాద్‌కు బీరువా తాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కందర్ప భాస్కర్, గాడేపల్లి సత్యనారాయణ, ఉపాధ్యాయులు రాజు, వీరేష్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

రౌతులపూడి: ఎరువుల దుకాణాల్లో బుధవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం తనిఖీ చేపట్టారు. రౌతులపూడిలో ఓషాపులో ఎరువులతోపాటు ఇతర వస్తువులు విక్రయించడాన్ని గుర్తించారు. షాపులోని రూ.4 లక్షల విలువైన సరకులను సీజ్ చేశారు. విజిలెన్స్ సీఐ, తహసీల్దారు ఏఓ రెడ్డి ఈశ్వరరావు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల నూతన భవనానికి శంకుస్థాపన

తొండంగి: వాకదారిపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య బుధవారం శంకుస్థాపన చేశారు. పెరుమాళ్లపురం పంచాయతీ లక్ష్మణుడుపేటలో తుఫాను పునరావాస కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నిర్వహిస్తున్నారు. డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించేందుకు వాకదారిపేటలో సుమారు 9 ఎకరాలు భూమిని గతంలో కేటాయించారు. ఈ నేపథ్యంలో ఒంటిమామిడి దివీస్ ల్యాబొరేటరీస్ సీఎస్ఆర్ నిధులు రూ.1.57 కోట్లతో కళాశాల భవనం నిర్మించేందుకు సహకారం అందిస్తోంది. ఎమ్మెల్యే దివ్య బుధవారం దివీస్ కంపెనీ సీనియర్ మేనేజర్ రావి సుధాకర్ తదితరులతో కలిసి శంకుస్థాపన పూజలు చేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ తీరప్రాంత గ్రామాల్లో దివీస్ కంపెనీ సీఎస్ఆర్ నిధులు రూ.2.40 కోట్లతో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో దివీస్ కంపెనీ ప్రతినిధులు బి.వాసుబాబు, కె.తేజ, ఎన్.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వాకదారిపేటలో డిగ్రీ కళాశాల భవనానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే యనమల దివ్య

ట్రాన్స్‌కో అధికారుల నిర్వాకం

- పంట కాలువపై ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు యత్నం
- కాలువ మధ్యలో స్తంభాల నిర్మాణం

ఏలేశ్వరం: వ్యవసాయం దండగ అని చెప్పే చంద్రబాబు తీరు ట్రాన్స్‌కో అధికారులకు ఒంటబట్టింది. రైతుల పట్ల ఏలేశ్వరం ట్రాన్స్‌కో ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యానికి వారి పనితీరు నిదర్శనంగా నిలుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా పంట కాలువలో స్తంభాల నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టారు. వందలాది ఎకరాలను సాగునీరు అందించే పంట కాలువలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు నిమిత్తం కాలువ మధ్యలో స్తంభాలు నిర్మిస్తున్నారు. వివరాల్లోకి వెళితే స్థానిక లింగవరంకాలనీలో టీడీపీ నాయకుల మధ్య ట్రాన్స్‌ఫార్మర్ మార్పు విషయమై కొంతకాలంగా వివాదం నెలకొంది. వీరి పంచాయతీ ఎమ్మెల్యే దృష్టికి వెళ్లింది. ఇద్దరికీ నచ్చచెప్పలేక ఎమ్మెల్యే కాలం వెళ్లదీస్తున్నారు. స్థానిక టీడీపీ నాయకులు ఎట్టకేలకు ట్రాన్స్‌ఫార్మర్ మార్పు చేసేందుకు అధికారులపై ఒత్తిడి తెచ్చారు. టీడీపీ నాయకుడి ఇంటిని అనుకుని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలంలోని మార్చాలని ఒత్తిడి తెస్తుండగా మరో నాయకుడు ప్రభుత్వ స్థలంలో మార్చడానికి కుదరదని చెప్పడంతో సమస్య జటిలమైంది. దీంతో పంట కాలువలో స్తంభాలు నిర్మించి దానిపై శ్లాబ్ వేసి ట్రాన్స్‌ఫార్మర్ పెట్టేందుకు అధికారులు నిర్ణయించి చర్యలు చేపట్టారు.



పంట కాలువ మధ్యలో నిర్మించిన నాలుగు స్తంభాలు



పంటకాలువ పక్కనే ప్రభుత్వ స్థలం

రైతులు ఆగ్రహం

ప్రభుత్వ స్థలాన్ని వదిలేసి పంట కాలువ మధ్యలో స్తంభాలు నిర్మించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ట్రాన్స్‌కో ఏఈ సూర్యనారాయణను వివరణ కోరగా రైతులకు ఇబ్బంది ఉంటే స్తంభాలు తొలగిస్తామన్నారు.



కాలువ మధ్యలో మిగిలి ఉన్న రెండు స్తంభాలు

తూతూమంత్రంగా స్తంభాల తొలగింపు

స్తంభాల నిర్మాణంపై రైతులు స్థానిక నగర పంచాయతీ వద్ద ధర్నా చేసి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ట్రాన్స్‌కో అధికారులు కంటితుడుపు చర్యగా కాలువలో నాలుగు స్తంభాలు ఉంటే రెండు తొలగించి మిగిలిన వాటిపై శ్లాబ్ వేసేందుకు చర్యలు ప్రారంభించారు. దీనిపై రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పూర్తిస్థాయిలో స్తంభాలు తొలగించాలని లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని రైతులు హెచ్చరిస్తున్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

తుని రూరల్: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ తుని సీడీపీఓ కె.శ్రీలత అన్నారు. బుధవారం డి.పోలవరం సెక్టార్ దొండవాకలో సూపర్‌వైజర్ విజయలక్ష్మి అధ్యక్షతన 'సుపోషిత్ భారత్, సాక్షర భారత్, సశక్త్ భారత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీడీపీఓ శ్రీలత పాల్గొన్నారు.

మహిళలు, పిల్లల ఆరోగ్య సంరక్షణే ధ్యేయం

కిర్లంపూడి: మహిళలు, పిల్లలు సంరక్షణే ధ్యేయంగా ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు కిర్లంపూడి ప్రభుత్వాసుపత్రి వైద్యుడు బి.రాంబాబునాయక్ తెలిపారు. జగపతినగరం కొండయ్యపేట రామాలయంలో వద్ద స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ శిబిరంలో సుమారు 30 మందికి మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు సుప్రియ, సాయి హేమాంజలి పాల్గొన్నారు.

చినశంకర్లపూడిలో వైద్య శిబిరం

ప్రత్తిపాడు: చినశంకర్లపూడి గ్రామ రామాలయం వద్ద బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. పెద్దిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.యశస్వీ మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. సర్పంచ్ ఏపూరి ఏడుకొండలు, ఎంపీటీసీ సభ్యుడు పిల్లా కొండలరావు (చిన్నా), పెద్దిపాలెం పీహెచ్‌సీ వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహార ప్రాధాన్యతపై అవగాహన

గండేపల్లి: మల్లేపల్లిలో బుధవారం స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.



మల్లేపల్లిలో గ్రామస్తులకు పోషకాహార ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

తొండంగి: ఏవీ నగరం పీహెచ్‌సీలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రవి కుమార్, వైద్యురాలు పి.భారతి 120 మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించారు.

గోకవరం: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో బుధవారం మహిళలకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు. జ్యోతుల లక్ష్మీదేవి, వైద్యులు రామలక్ష్మి పాల్గొన్నారు.

మహిళలకు మెరుగైన వైద్య సేవలు

ప్రత్తిపాడు రూరల్: మహిళలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా స్వస్త్ నారీ–సశక్త్ పరివార్ అభియాన్ నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. రాచపల్లిలో వైద్య శిబిరాన్ని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. రాచపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి వై.గీతాసుధ, డాక్టర్ ఉషశ్రీ పాల్గొన్నారు.

ముద్రగడను కలిసిన తోట



కిర్లంపూడిలో ముద్రగడను కలిసిన తోట నరసింహం, శ్రీరాంజీ

కిర్లంపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభంను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట కో ఆర్డినేటర్ తోట నరసింహం కిర్లంపూడిలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ముద్రగడ ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఇరుకుటుంబాల మధ్య ఉన్న అనుబంధాన్ని తోట నరసింహం గుర్తు చేసుకున్నారు. ఆయనతో పాటు రాష్ట్ర వైఎస్సార్ సీపీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట శ్రీరాంజీ ముద్రగడను కలిసారు. అనంతరం వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబును కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు తోట బాబ్జీ, జిల్లా ఉపాధ్యక్షుడు రామకుర్తి రామచంద్రమూర్తి, అడారి మహేష్, పీలా సుబ్రహ్మణ్యం, మాకా వెంకటేష్, వేగి సాంబశివ ఉన్నారు.

మోదీ సర్‌కి విద్యార్థుల విషెస్



జగ్గంపేట: భారత ప్రధాని నరేంద్రమోదీ 75వ జన్మదిన వేడుకలు మండలంలోని కాట్రావులపల్లిలో గౌతమ్ స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 75 అంకెను, మోదీ పేరును విద్యార్థులు అక్షరక్రమంలో అమరి కూర్చుని 'మోదీ సర్.. జన్మదిన శుభాకాంక్షలు' అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో స్కూల్ యాజమన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగునికి ఆర్థిక సహాయం



అజిత్‌కుమార్‌కు సహాయం అందజేస్తున్న డాక్టర్ సురేష్‌కుమార్ తదితరులు

తుని: తండ్రిని కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు పడుతున్న దివ్యాంగుడు కె.అజిత్‌కుమార్‌కు తుని రోటరీ క్లబ్ ఆర్థిక సహాయం అందించి బాసటగా నిలిచింది. నక్కపల్లి మండలం దేవవరానికి చెందిన దివ్యాంగుడు అజిత్‌కుమార్ ఇటీవల తండ్రిని కోల్పోవడంతో దైనందిన జీవనానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. రోటరీ క్లబ్ డాక్టర్ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ సభ్యులు అజిత్‌కుమార్‌కు రూ.45 వేలు విలువ చేసే ఐరన్‌బడ్డీ, కుట్టుమిషన్‌ను అందజేసారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు టి.నాగిరెడ్డి, కార్యదర్శి డి.ప్రసన్న కుమార్, ట్రెజరర్ పి.కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

మురళీకృష్ణంరాజు పరామర్శ



వెంకటనగరంలో బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: వెంకటనగరంలో బుధవారం వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన దళిత యువకుడు మట్టల జానురాజు ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని మురళీకృష్ణంరాజు పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముప్పిడి నూకరాజు, రేస్ ప్రకాష్, కోలా తాతబాబు, తిమ్మిశెట్టి రాజా, అంబటి గణేష్ తదితరులు పాల్గొన్నారు.